# ఔట్ సోర్సింగ్ – దుర్జనులు

ఇంతకుముందు ఔట్‌సోర్సింగ్ మీద ఔట్‌సోర్సింగ్ ఒకటి, ఇంకోటి, మరోటి, సర్జనులు అని నాలుగుసార్లు కబుర్లు చెప్పుకున్నాం. పోయినసారి సర్జనులు అయింది కనుక ఈసారి దుర్జనుల గురించి. సర్జనులు కానివారు దుర్జనులని కాదు నా అభిప్రాయం. కాకపోతే కాస్త ప్రాస కోసం ప్రయాస. దుర్జనులకి వ్యతిరేక పదం సజ్జనులు. ఆ విషయం గురించి ఇంకొకసారి. ఇప్పుడు ఈ దుర్జనుల గురించి చూద్దాం.

0 0 0

'దూరపు చుట్టాలంటే ఎవ్వరా?'

'దూరపు చుట్టాలంటే ఎక్కడో ఢిల్లీలో వుండే చుట్టాలన్నమాట'

'మరి దగ్గర చుట్టాలంటే?'

'అంటే ఎప్పుడూ మనింట్లోనే వుండే చుట్టాలన్నమాట'

'మరి చెడ్డ చుట్టాలంటే?'

'చెడ్డ చుట్టాలు, మంచి చుట్టాలు అంటూ ఎవరూ వుండరు. అందరూ మంచివాళ్ళే. కొందరు వుండి మంచివాళ్ళవుతారు. కొందరు వెళ్ళి మంచివాళ్ళవుతారు'

ఇది ఏనాడో చదివిన ముళ్ళపూడిగారి జోకు. దేశభక్తులూ దేశద్రోహులూ అనేవాళ్ళు కూడా మనం ఎటునించీ చూస్తున్నాం అన్నదాన్ని బట్టి వుంటుంది అని మనం ఇక్కడే కొన్నాళ్ళ క్రితం అనుకున్నాం. అలాగే ఈ దుర్జనులు కూడాను. వాళ్ళు నిజంగా సజ్జనులే కానీ, ఇంకో పక్కనించీ చూస్తేనే దుర్జనులవుతారు.

0 0 0

1990 దశకం మొదట్లో నేను ఒక సెమీకండక్టర్ కంపెనీలో పనిచేసేప్పుడు ఒక సంఘటన జరిగింది. చిప్స్ తయారు చేసే (తినే చిప్పు కాదు, ఇంటెల్ మోటరోలాలాటి కంపెనీలు చేసే సెమీకండక్టర్ చిప్స్) మెషీన్‌కి కావలసిన కొన్ని వేల పార్ట్స్ కొని, చిన్నా పెద్ద అసెంబ్లీలు, మొత్తం మెషీనూ అంతా మావాళ్ళే చేసేవాళ్ళు. పవర్ సప్లైలు, కేబుల్స్, న్యుమాటిక్ అసెంబ్లీలు... అన్నీ. ఒక మీటింగులో మా వైస్ ప్రెసిడెంట్‌తో అన్నాను, మనమెందుకు అవన్నీ చేయటం, మనం చేయాల్సిన సెమీ కండక్టర్ మెషీన్లు మనం చేద్దాం, కావల్సిన అసెంబ్లీలు చేయటానికి అవి చేసే కంపెనీలకి ఔట్‌సోర్సింగ్ చేద్దాం అని. ఆ రోజుల్లో అప్పుడే ఔట్‌సోర్సింగ్ మొదలవుతున్నది. మా కంపెనీకి లాభాలేమిటో ప్రెజెంటేషన్ చేసి చెప్పాను. కొన్ని ప్రశ్నలూ సమాధా

నాలూ, రిటర్న్ ఆన్ ఇన్వెస్టమెంట్, పే ఆఫ్ ఎనాలిసిస్ మొదలైన హంగామా అంతా అయాక, ఒక ఔట్‌సోర్సింగ్ గ్రూప్‌ని పెట్టి దానికి నన్ను మేనేజర్ని చేశారు. అప్పుడే మొదలయింది అసలు కథ.

నేనొక మాన్యుఫాక్చరింగ్ సెల్‌కి వెళ్ళి(అంటే ఒక పెద్ద అసెంబ్లీని తయారు చేసే గ్రూప్), 'అయ్యా లేక అమ్మా! మీరు చేసే అసెంబ్లీని నేను చైనాకో, తైవానుకో ఔట్‌సోర్సింగ్ పేరుతో పంపించి, మీ ఉద్యోగాలు ఊడగొట్టించాలని పెద్దలు నిశ్చయించారు కావున మీరు నాకు ఆ విషయంలో కావలసిన సాంకేతిక సహకారం అంతా అందించి మేం ఇచ్చే తాంబూలం తీసుకుని మీ ఇళ్ళకి వెళ్ళిపోవాలని మా ప్రార్థన' అని అడగాల్సివచ్చింది. అంటే స్వచ్ఛమైన తెలుగులో, ఇవిగో గునపాలూ పారలూ, మీ గోతులు మీరే తవ్వుకుని మీ పనులు నాకప్పగించి, ఆ గోతుల్లో కూర్చోండి, నేను మట్టి పోస్తానూ అని.

సహాయం చేయటం మాట అటుంచి, నేను అనుకున్నట్టుగానే నన్నో దుర్జనుడిగా భావించి దూరమయారు - దుష్టులకి దూరంగా వుండాలని కాబోలు. నేనేకాదు, నా గ్రూపులో ఇంజనీర్లు, పర్చేజింగ్ వాళ్ళు ఎవరికీ ఏ సహాయమూ లభించలేదు. తరువాత గేర్లు మార్చి, మళ్ళీ వాళ్ళ దగ్గరికి వెళ్ళి రకరకాల పద్ధతులు ఉపయోగించి, పని పూర్తిచేసుకోవాల్సివచ్చింది. అది వేరే విషయం. రాముడు మంచి బాలుడులాటి వారు కూడా ఈ ఔట్‌సోర్సింగుల యుగంలో ఎలా దుర్జనావతారం ఎత్తుతారో చూపించటానికిది వ్రాస్తున్నాను.

0 0 0

రెండు మూడు నెలల క్రితం ఆస్టిన్ పేపర్లో బెంగుళూరు మీద ఒక వ్యాసం వచ్చింది. ఇండియాకి అది ఔట్‌సోర్సింగ్ రాజధాని అని. అక్కడికి ఎన్ని కంపెనీలు ఎన్ని ఉద్యోగాలని అమెరికనించీ తీసుకువెళ్ళాయో, అక్కడ సాఫ్ట్‌వేర్ వ్యాపారం, కాల్ సెంటర్ వ్యాపారం ఎంత జోరుగా జరుగుతున్నదో విపులంగా వ్రాశారు. ఇండియాలో బెంగుళూరు తరవాత అంత గొప్ప ఔట్‌సోర్సింగ్ వూరు నయోడా అనీ, ఆ వూరు వివరాలు కూడా ఇచ్చారు. బాగుందే ఇది, మంచి వ్యాసం అనుకున్నాం తెలుగు మిత్రులం. కానీ మర్నాటినించీ ఎడిటర్జీగారికి ఉత్తరాల రూపంలో వచ్చిన అర్జీలు చాల వున్నాయి. అమెరికాలో ఉద్యోగాలన్నీ ఇండియాకి వెళ్ళిపోతున్నాయనీ, అది అన్యాయమనీ దాని గురించి ఒక వ్యాసం కూడానా హన్నా అని కోపడ్డారు. అలా దుర్జనులు అర్జునులలా ఒక వారం రోజులు తమ బాణాలని సంధించారు. వాళ్ళ మనసుల్లో మాటలు అలా బయటపెట్టారు కుడాను.

0 0 0

నేనీమధ్య ఒక బ్రిటిష్ కంపెనీకి కొన్నాళ్ళు కన్సల్టింగ్ పని చేశాను. అక్కడ సాఫ్ట్‌వేర్ పని నాలుగు ఇండియన్ కంపెనీలకి ఔట్‌సోర్సింగ్ చేశారు. ఆ నాలుగు కంపెనీలూ ఏవేవో మీకందరికీ తెలుసు కనుక, ఆ కంపెనీల పేర్లు నేను చెప్పటం లేదు. వాటిని వాళ్ళు ముద్దుగా ఇండియన్ ఫోర్ అని పిలుచుకుంటారు. నేను మొట్ట మొదటిసారి అక్కడి ఇంజనీర్లని కలిసినప్పుడు వాళ్ళు ఇండియన్ ఫోర్ అని వాడు

తుంటే నాకేమీ అర్థంకాలేదు. తర్వాత ఒకతను చెప్పాడు. అదేమిటో. వాళ్ళల్లో ఒక కంపెనీ పేరు నీ పేరే అని కూడా అన్నాడు. కొంతమంది సులువుగా వుంటుందని అలా అంటున్నా, కొంతమంది అదేదో దుష్టచతుష్టయంలాగా అనేవారు. తరువాత ఆ మాట నాకూ అలవాటయినా, వాళ్ళు అంటున్నప్పుడు మాత్రం మాయాబజారులో రమణారెడ్డి అన్నట్టుగా దుషటచతుషటయంలాగా వినపడేది. సాఫ్ట్‌వేర్‌లో ఏ మాత్రం సమస్య వచ్చినా, తప్పంతా ఇండియన్ ఫోర్‌ది అనేవాళ్ళు కూడా వున్నారక్కడ. వాళ్ళల్లో కొంతమంది ఆమాట నిజమయినా కాకపోయినా, ఔట్‌సోర్సింగ్ మీద తమ అభిప్రాయాలు సూటిగానో డొంక తిరుగుడుగానో చెప్పకనే ఇలా చెబుతుంటారు.

0 0 0

ఇక్కడ మాకు కోనన్ ఒబ్రయాన్ షో అని ఒక అర్థరాత్రి టీవీ షో వుంది. దాంట్లో ఈమధ్య ఒక సరదా సన్నివేశం చూపించారు. ఇది దుర్జన దృష్టితో తీసింది కాదు కానీ, ఇది చూసిన కొంతమంది మనసారా నవ్వుకోకుండా తమ దుర్జనత్వం కొంత చూపించారు. సరదాగా చెప్పుకునేటప్పుడు అది మనకి అనవసరం.

ఆ చిన్న టీవీ క్లిప్‌లో ఒకతను తన కంప్యూటర్ పాడయిపోయిందని, ఏంచేయాలో చెప్పమని ఒక కంప్యూటర్ కంపెనీకి ఫోన్ చేస్తాడు. అతను అమెరికా నించే ఫోన్ చేసినా ఆ కాల్ తీసుకున్నది బెంగుళూరులోని కాల్ సెంటర్‌లో ఒక అమ్మాయి. అతను ఫోన్‌లో తన కంప్యూటర్ సంగతి చెబుతుంటే ఆ అమ్మాయికి అర్థమవదు. 'అయితే నేనే అక్కడికి వస్తానుండు' అంటాడు.

తరువాత సీనులో ఒక ఆటోలో తెల్లతను, అతని ఒళ్ళో కంప్యూటరూ. బెంగుళూరులో ఒకటి రెండు రోడ్లూ, రోడ్డు మీద సినిమా బోర్డులూ చూపిస్తారు. ఆ కాల్ సెంటర్‌కి వెళ్ళి ఆ అమ్మాయి కావాలని అడుగుతాడు. ఆ అమ్మాయి వస్తుంది. వెనకాల సినిమా సంగీతం. ఇతను ఆ అమ్మాయిని, ఆ అమ్మాయి ఇతన్ని హీరో హీరోయిన్లలా చూసుకుంటారు. ఇతని కంప్యూటర్ని ఎవరో వచ్చి రిపేరు చేస్తుంటారు. కానీ బాగవదు. ఇతనే తన కంప్యూటర్ని, పక్కనే వున్న ఇంకా కొన్నిటిని కూడా రిపేరు చేస్తాడు. అందరూ అది చూసి అతని దగ్గరికి వస్తారు. వాళ్ళందరూ కలిసి ఒక సినిమా పాటకి గ్రూపు డాన్స్ చేస్తారు. అతనూ ఆ అమ్మాయీ కలిసి ఒక ఆటోలో ఎక్కి అమెరికాకి బయల్దేరతారు.

ఇది మొత్తం ఐదు నిమిషాలువుంటుందేమో. చాల సరదాగా హాస్యంగా చిత్రించాడు కోనన్ ఒబ్రియాన్. మర్నాడు అన్ని ఆఫీసుల్లోనూ మీరు చూశారా అంటే మీరు చూశారా అనుకోవటమే. చూడనివాళ్ళకి ఆ టీవీ స్టేషన్ వెబ్‌సైట్లో కొన్నాళ్ళు దుర్జనులని కొంత ఆట పట్టిస్తూ ఆ విడియో క్లిప్ పెట్టారు కూడాను.

0 0 0